
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 54 వ భాగం

### దక్ష ప్రజాపతి – 3

### ఈశ్వర దక్షుల విరోధం

దక్షుడు తను వచ్చినప్పుడు తనని చూసి కూడా కూర్చున్నవాడు లేవలేదనీ, కనీసం పలకరించలేదనీ కోపం తెచ్చుకుని ఈశ్వరుణ్ణి దూషించడం మొదలుపెట్టాడని ముందు వ్యాసంలో చూసాం కదా? తనని ఇంత నిందారోపణ చేసినా శివుడు నోరు మెదపలేదు. కోపంతో అరిచేవారు అవతలివారు నోరు మెదపకపోతే మరింత రెచ్చిపోవడం మనకి తెలిసిందే కదా. ఇప్పుడింకో మెట్టు పైకెక్కి చెప్తున్నాడు దక్ష ప్రజాపతి.

క. అని యిట్టులు ప్రతికూల వ
చనములు దక్షుండు పలికి శపియింతును శ
ర్వుని నని జలములు గొని కర
మున నిలిపి యిటులనె రోషమున ననఘాత్మా! [4-45]

అలా శివుణ్ణి దూషిస్తూ, చేతిలోకి నీళ్ళు తీసుకుని ఈ శివుణ్ణి శపిస్తాను అన్నాడు రోషంతో. ఇక్కడ వరకూ వచ్చిన కథ చూస్తే మనకో విషయం తెలుస్తుంది. ప్రజాపతులు అంటే ఎవరు? జనాలని వృద్ధి చేసేవారు. అంటే మనుష్య సంతతి పెరగడానికి కారకులు. అలా పుట్టిన మనుషులు వారి వారి తత్వాలని బట్టి మునులూ, ఋషులు, ఆత్మ జ్ఞానులూ అవ్వొచ్చు. ఆత్మ జ్ఞానులైన వాళ్ళని మనం భగవంతులైనవారు అంటున్నాం. మరి ఈ ప్రజాపతులో? వాళ్ళు యుగానికీ కల్పానికీ మారుతూ ఉంటారు. ఇక్కడ దక్షుడు ప్రజాపతి మాత్రమే. కానీ శివుడో? ఆయన లయకారుడు. ఆయనెటువంటివాడో ముందోసారి చెప్పాడు కదా పోతన – **జన్మమరణాది నివర్తకుం డగు నభవుడు.** (4.28). కానీ తన కూతుర్ని ఇచ్చాను కనక నేను శివుడికంటే అధికుణ్ణి అనే అహంకారం దక్షుడిలో అంతర్గతంగా ఉంది కాబోలు. దాని వల్ల కోపం మొదలైంది. మనలాంటివాడే. ఏదో కోరిక కోరుకోవడం అది తీరకపోతే భగవంతుణ్ణి నిందించడం. ఇంత చేసినా శివుడు నోరు మెదిపాడా? ఎందుకు మెదపలేదంటే ఆయన భగవంతుడు.

క. "ఇతఁ డింద్రోపేంద్ర పరీ
వృతుఁడై మఖసమయమున హవిర్భాగము దే
వతలం గూడఁగ మహిత ని
యతిఁ బొందక యుండుఁగాక యని శపియించెన్." [4-46]

దక్షుడు ఇలా అని "ఈ శివుడు ఇంద్రుడు, విష్ణువులతో పాటు యజ్ఞం చేసే సమయంలో హవిర్భాగం పొందకుండుగాక" అని శపించాడు. పై పద్యంలో పోతన వాడిన విష్ణువు అనే పదం, యజ్ఞం అనే పదం ఎక్కడున్నాయో చెప్పగలరా? ఇంద్రోపేంద్ర – ఇంద్ర + ఉపేంద్ర. ఉపేంద్ర – అంటే వామనావతారంలో ఇంద్రుడికి తమ్ముడిగా పుట్టాడు కదా, అందువల్ల విష్ణువు ఉపేంద్రుడు. మఖసమయమున – మఖ (యజ్ఞ), సమయములో.

వ. ఇట్లు దక్షుండు పల్కిన గర్హితవాక్యంబులు వినిందితంబు లగుం గాని యాథార్థ్యంబున వాస్తవంబు లగుచు భగవంతుండగు రుద్రునందు నిందితంబులు గాక స్తుతి రూపంబున నొప్పెఁ; దదనంతరంబ రుద్రునకు శాపం బిచ్చిన కారణంబున దక్షుండు సదస్యముఖ్యులచే 'నకృత్యం' బని నిషేధింపబడి ప్రవృద్ధంబయిన క్రోధంబుతోడ నిజనివాసంబునకుం జనియె; అంత గిరిశానుచరాగ్రేసరుం డగు నందికేశ్వరుండు దక్షుండు నిటలాక్షుని శపియించిన శాపంబు, నతనిఁ బల్కిన యనర్థ వాక్యంబులును విని కోపారుణితలోచనుండై యిట్లను "నీ దక్షుండు మర్త్యశరీరంబు శ్రేష్ఠంబు గాఁ దలఁచి యప్రతిద్రోహియైన భగవంతునందు భేదదర్శియై యపరాధంబుఁ గావించె; ఇట్టి మూఢాత్ముండు దత్త్వ విముఖుం డగు; మఱియుం గూటధర్మంబు లయిన నివాసంబుల గ్రామ్యసుఖకాంక్షలం జేసి సక్తుండై యర్థవాదంబు లైన వేదంబులచేత నష్టమనీషం గలిగి కర్మతంత్రంబు విస్తృతంబు చేయు; వెండియు దేహాదికంబు లుపాదేయంబులు గాఁ దలఁచుచు బుద్ధిచేత నాత్మతత్త్వంబు మఱచి వర్తించుచుఁ బశుప్రాయుండై స్త్రీకాముండు నగు; నిదియునుం గాక దక్షుం డచిరకాలంబున మేషముఖుం డగు" నని మఱియు. [4-47]

కోరినది తీరకపోతే మనం నిందించినట్టు, మనలాగ దక్షుడు కూడా కోపంతో భవంతుణ్ణి దూషించాడు. అయితే ఇలా తిట్టిన తిట్లు నిజానికి మరో అర్థంలో వాస్తవాలై, అవి శివుడిని స్తుతి రూపంలో అలంకరించాయి (పోతనలో శివభక్తుడిని గమనించారా?). భలేవారే, తిట్లు భూషణాలు, స్తుతిలా ఎలాగ అవుతాయి అంటారా? అయితే దీని గురించి శివానందలహరి లో శ్రీశంకర భగవత్పాదులు ఏమంటున్నారో చూద్దాం.

ఆశనం గరళం ఫణీ కలాపో
వసనం చర్మ చ వాహనం మహోక్షః
మమ దాస్యసి కిం కి మస్తి శంభో
తవ పాదాంబుజ భక్తిమేవ దేహి [శివానందలహరి. 87]

"నువు భుజించేది విషం. మెడలో అలంకరించుకునేది పాము. కట్టుకునేది ఏనుగు చర్మం. ఎక్కి తిరిగే వాహనం ముసలి ఎద్దు. ఇంక నాకు కావాల్సినది నీ దగ్గరేముంది? నాకేమి ఇవ్వగలవు? నీ పాద భక్తి ఇస్తే అది ఒక్కటే చాలు" అంటే ఇక్కడ కూడా శ్రీశంకర భగవత్పాదులు శివుణ్ణి నిందించినట్టు అనిపిస్తుంది కానీ నిజానికి అవి శివుడికి స్తుతి కదా? అలాగే దక్షుడు అన్నమాటలు మరో అర్థంలో వాస్తవాలు అయి పరమేశ్వరుడికి స్తుతి అయ్యాయి.

బుద్ధుడు కూడా ఎవరైనా తనని నిందిస్తే ఇలాగే అనేవాడుట – నువ్వు నాకిచ్చిన నిందలు నేను తీసుకోలేదు అని. అంటే అవి తిట్టినవాళ్ళ దగ్గిరే ఉన్నాయని అర్థం. అంటే మహర్షులైన వాళ్ల దగ్గిరకెళ్ళి దూషిస్తే ఏమౌతుంది? వాళ్ళెవరో వాళ్ళకి తెలుసు కనక ఆ తిట్లతో తమని పోల్చుకోకుండా, తిట్టే వాళ్లని చూసి నవ్వి ఊరుకుంటారు. అయితే అవి వాళ్ళు తీసుకోరు కనక తిట్టినవాళ్లకే తగుల్తాయి. ఇది ఇంతకుముందు వ్యాసాలలో రమణ తత్త్వం గురించి వివరించినపుడు చదువుకున్నాం కదా?

అలా దక్షుడు శివుణ్ణి శపించడం విని సదస్యులు 'నీవు చేసినది చెడ్డపని (అకృత్యంబని)" అనేసరికి దక్షుడికి మరింత కోపం వచ్చింది. అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయాడు. మరో చోట బ్రహ్మ తో సహా మిగతా దేవతలందరూ 'ఆయన పరమేశ్వరుడు అలా అనడం తగదు' అని శివుడి గురించి దక్షుడికి నచ్చ

చెప్పాలని చూసారనీ, ఆయన కోపం తో ఒప్పుకోక ఇలా శపించాడనీ కథనం ఉంది. అయితే శివుడు ఏమీ మాట్లాడలేదు కానీ అక్కడే ఉన్న నందికి కోపం వచ్చి తిరుగు శాపం పెట్టాడు – "ఈ మానవ శరీరం శ్రేష్ఠం అనుకుంటూ దక్షుడు శివుడిని దూషించి అపరాధం చేసాడు. కుటిల ధర్మాలు ఆచరిస్తూ, ఆత్మ తత్త్వం మర్చిపోయి, పశుప్రాయిడై, స్త్రీలోలుడై, దక్షుడు మేక మొహం పొందుగాక" అంటూ.

మ. "అనయంబుం దన మానసంబున నవిద్యన్ ముఖ్యతత్త్వంబు గాఁ
గని గౌరీశుఁ దిరస్కరించిన యసత్కర్మాత్ము నీ దక్షుని
న్ననువర్తించినవాఁరు సంసరణకర్మారంభుఁలై నిచ్చలున్
జననం బందుచుఁ జచ్చుచున్ మరల నోజం బుట్టుచున్ వర్తిలున్. [4-48]

శాపం ఇంకా పూర్తవలేదు, "నిత్యం మనసులో అవిద్యని ముఖ్య తత్వం (అసలు విద్య) గా భ్రమిస్తూ ఈశ్వరుణ్ణి తిరస్కరించే ఈ అబద్ధపు కర్మ కలవాణ్ణి (యసత్కర్మాత్ముని), దక్షుణ్ణి అనుసరించే వారు కూడా అలా పుడుతూ ఛస్తూ ఉంటారు గాక." ఇదే విషయం మనం ఈశావాశ్యోపనిషత్తులో చూడవచ్చు – అవిద్యాయా మృత్యుంతీర్త్వా విద్యాయామృత మశ్నుతే. అవిద్య చేత మరణ జననాలూ, విద్య (ఆత్మ జ్ఞానం) చేత అమృతత్త్వం.

వ. అదియునుం గాక యీ హరద్వేషులైన ద్విజులర్థవాద బహుళంబు లైన వేదవాక్యంబుల వలన మధుగంధ సమంబైన చిత్తక్షోభంబుచేత విమోహిత మనస్కులై కర్మాసక్తు లగుదురు; మఱియును భక్ష్యాభక్ష్య విచారశూన్యులై దేహాది పోషణంబుకొఱకు ధరియింపఁ బడిన విద్యా తపోవ్రతంబులు గలవారలై ధన దేహేంద్రియంబుల యందుఁ బ్రీతిం బొంది యాచకులై విహరింతురు;" అని నందికేశ్వరుండు బ్రాహ్మణజనంబుల శపియించిన వచనంబులు విని భృగుమహాముని మరల శపియింపం బూని యిట్లనియె. [4-49]

నంది ఇలా అని ఊరుకున్నాడా? దక్షుడు శివుణ్ణి శపించడం చూసి కూడా ఏమీ చేయకుండా ఉన్నవాళ్లని అక్కడి సదస్యులనీ చూసి చెప్తున్నాడు, "ఈ శివ ద్వేషులైన ఈ యజ్ఞం చేసే ద్విజులు కూడా అర్థవాదాలతో నిండిన వేదవాక్యాలతో కల్లువంటివి తాగితే వచ్చేకైపుతో మనో మాలిన్యం సంపాదించుకుని, ఏది తినాలో ఏది తినకూడదో తెలియక దేహ ఇంద్రియాలతో మోహం పొంది యాచకులౌతారు." మరి శివుణ్ణి శ్మశాన సంచారి అన్నాడు కదా దక్షుడు అందుకు ఇలా నంది ప్రతి శాపం పెట్టాడన్న మాట.

అయితే ఇక్కడో చిన్న మలుపు. దక్షుడికీ శివుడికీ ఏవో స్పర్ధలున్నాయి సరే. దక్షుడు శివుణ్ణి శపిస్తే ఆయన ఊరుకున్నా నందికి కోపం వచ్చి దక్షుణ్ణి తిరిగి శపించాడు. కథ బాగానే ఉంది ఇంతవరకూ. మరి ఈ యజ్ఞం చూడ్డానికొచ్చిన సదస్యుల తప్పేం ఉంది ఇందులో? వాళ్లని కూడా శపించాడు కదా నంది? అందువల్ల ఆ సదస్యులలో ఉన్న భృగుమహామునికి ఇది విని కోపం వచ్చింది. ఆయన తిరిగి శపిస్తున్నాడు.

కొన్ని పురాణాలలో భృగు మహర్షి నందికి తిరుగు శాపం ఇచ్చాక అభిచార హోమం చేసి ఈ శివభక్తులనందర్నీ ఆ యజ్ఞవాటికలోంచి బయటకి తరమగొట్టాడనే కథ ఉంది.

తే. "వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులు వారు
వారి కనుకూలు రగుదు రెవ్వారు వారు
నట్టి సచ్ఛాస్త్ర పరిపంథు లైన వారు
నవనిఁ బాషండు లయ్యెద" రని శపించె. [4-50]

“శివభక్తులైనవారు (ధూర్జటివ్రతులు. ధూర్జటి అంటే మట్టి జడలు ఉన్నవాడు – శివుడు) అందరూ కూడా బూడిద పూసుకుని పాషండలని పిలవబడతారు గాక.” మరి దక్షుణ్ణి అనుసరించేవారు “దేహ ఇంద్రియాలతో మోహం పొంది యాచకులౌతారు” అని శపించాడుగా నందీశ్వరుడు?

సీ. "సకల వర్ణాశ్రమాచార హేతువు, లోక;
మునకు మంగళమార్గమును, సనాత
నముఁ, బూర్వఋషిసమ్మతము, జనార్దనమూల;
మును, నిత్యమును, శుద్ధమును, శివంబు,
నార్యపథానుగం బగు వేదమును విప్ర;
గణము నిందించిన కారణమున
నే శివదీక్ష యందేని మధ్యమ పూజ్యుఁ;
డై భూతపతి దైవ మగుచు నుండు [4-51]

తే. నందు మీరలు భస్మజటాస్థిధార
ణములఁ దగి మూఢబుద్ధులు నష్టశౌచు
లై నశింతురు పాషండు లగుచు" ననుచు
శాప మొనరించె నా ద్విజసత్తముండు. [4-51.1]

“వేదాలు జనార్ధనుడికి మూలాలు కదా? అవి వర్ణాశ్రమాచారాలకి హేతువులు, లోకానికి మంగళమార్గం చూపేవి, శాశ్వతమైనవీ, పరిశుద్ధమైనవీను. కానీ వాటిని పఠించే విప్రగణాన్ని నిందించాడు ఈ శివభక్తుడైన నంది. అందువల్ల ఈ శివభక్తులందరూ పాషండులై నశిస్తారు గాక” అని తిరిగి శాపం పెట్టాడు భృగుమహర్షి.

ఇక్కడ వరకూ వచ్చాక కథ వెనక్కి చూస్తే అసలు దేనివల్ల ఇదంతా మొదలైంది? జనన మరణాలు లేని భగవంతుడైన శివుడు, నేను ప్రజాపతిని, నామూలానే ఈ ప్రపంచం ఉద్భవించిందీ అనుకునే దక్షుడికి సరైన గౌరవం ఇవ్వలేదని ప్రజాపతి అనుకోవడం వల్ల. ఇదెంత చిన్న విషయం? అసలు శివుడు ఎందుకు ఆసనం మీదనుంచి లేవలేదో ఆయన మనసులో ఏముందో ఎవరికీ తెలియదు. కోపం వస్తే వచ్చింది దక్షుడికి; అక్కడ ఊరుకుని ఇలా ఎందుకు జరిగింది అనే ఆలోచనే లేకుండా ఈయన నా అల్లుడు అంటూ మొదలుపెట్టి, ఈయన ఎందుకూ పనికిరానివాడు, భస్మం పూసుకు తిరుగుతాడు అంటూ రకరకాల తిట్లు మొదలు పెట్టాడు. పోనీ అక్కడా ఊరుకున్నాడా అంటే అదీ లేదు. చివరకి శాపం పెట్టాడు కోపం తీరడానికి.

వ. ఇట్లన్యోన్యంబును శాపంబులం బొందియు భగవదనుగ్రహంబు గల వారలగుటం జేసి నాశంబు నొందరైరి; అట్టి యెడ విమనస్కుం డగుచు ననుచర సమేతుం డై భవుండు చనియె నంత. [4-52]

ఇలా ఒకళ్ళకొకరు శాపాలు పెట్టుకున్నా ముందు చేసుకున్న పుణ్యాలవల్ల పూర్తిగా నాశనం అవలేదు ఎవరూ. ఇదంతా చూసి పరమేశ్వరుడు వ్యాకులంతో తన అనుచరుల్ని వెంట బెట్టుకుని వెళ్ళిపోయాడు.

ఈ కథ చూస్తే మనకి తెలిసేది ఒకటే. భగవంతుణ్ణి ఏదో ఇవ్వలేదని కోపగించుకోవడం, ఇస్తే మరోసారి ఇవ్వమని అడగడం, ఇంకా ముందుకి పోతే కోపంతో మన కోరిక తీర్చనందుకు అసలు దేవుడే లేడని ప్రచారం చేయడం, నాస్తికుడవడం అన్నీ మనకి తెలిసిన కథలే. అయితే మనం అడిగినవన్నీ ఏ దేవుడైనా, దేవతైనా ఎందుకివ్వాలి అనేది మనం ఎప్పుడైనా ఆలోచిస్తామా? భగవంతుడనేవాడు ఓ సాక్షి. మన కర్మ మనం అనుభవించవల్సిందే. ఎంతటి ఆత్మ జ్ఞానులైనా శ్రీరామకృష్ణులూ, రమణులూ కూడా కష్టమైన జీవితాలు గడిపి దేహం కలిగినందుకు చివర్లో వాటి తాలూకు రోగాలూ, బాధలూ అనుభవించినవారే కదా? రామకృష్ణులు చివరి రోజుల్లో నోట్లో వచ్చిన (రాచ) పుండు వల్ల ద్రవాహారం కూడా తీసుకోలేనప్పుడు కూడా కాళీమాతని – అమ్మా అంతా నీ ఇష్టమే – అని తప్ప ఏమీ అడిగేవారు కాదుట. "అదేమిటండీ, మీరే చెప్తూ ఉంటారు కదా, అమ్మని వ్యాకులంతో ఏమి అడిగినా ఇస్తుంది అని, ఈ పుండు మాన్పమని అడగగొచ్చుకదా" అని ఎవరైనా అంటే. "పోవయ్యా, నేను అమ్మని ఎప్పటికీ అటువంటివి, అలా అడగలేను" అనేవారుట. అదీ అసలైన భక్తుడి వరస. అటువంటి విషయాలలోనే మనకీ వాళ్లకీ తేడా ప్రస్ఫుటంగా కనబడుతూ ఉంటుంది.

దక్షుడు శాపం పెట్టాడు సరే మరి అక్కడే ఊరుకోవచ్చుగదా? అలా ఊరుకోకుండా దీన్ని ఇంకా సాగదీస్తాడు ముందు ముందు. ఎంతవరకూ అంటే అది చివరకి తన మీదకి బ్రహ్మాస్త్రంలాగా తిరిగి వచ్చేదాకా. ఇలా జరగడాన్నే భగవద్గీత శ్లోకంలో మనం చూడవచ్చు.

ధ్యాయతో విషయాన్పుంసః సంగస్తే షూపజాయతే
సంగాత్సంజాయతే కామః కామాత్ క్రోధోభిజాయతే
క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతిభ్రంశా బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి [భగవద్గీత, సాంఖ్యయోగం 2.62, 2.63]

[విషయవాసనల వల్ల – అదేపనిగా వాటిగురించి ఆలోచించడం వల్ల – వాటిలో అనురాగం/ఆసక్తి. దానివల్ల కామము/కోరిక. అన్ని కోరికలూ తీరడం అసాధ్యం కనక, కోరికలు తీరకపోవడం వల్ల కోపం, కోపం వల్ల అవివేకం – సమ్మోహం, విచక్షణ జ్ఞానం నశించడం, అవివేకం వల్ల స్మృతి భ్రంశం. అక్కడనుంచి బుద్ధిని పోగొట్టుకుని నాశనం/ అధోగతి పొందడం]

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS